www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 10 | మార్చి | 2026
పేజీలు : 8

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిది హత్యా, ఆత్మహత్య

- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు
- పోలీసులకు లొంగిపోయిన భర్త

ప్రజాపక్షం/కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కవిత (35) ఉరితో మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇది హత్యా, ఆత్మహత్యా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కవిత, నాగేశ్వరరావు దంపులు ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు. కాగా భర్త నాగేశ్వరరావుకు అతని వదినతో అక్రమ సంబంధం ఉదనే అనుమానంతో అనునిత్యం వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా ఆదివారం రాత్రి కూడా ఇదే విషయంపై పెద్ద ఎత్తున ఇరువురి మధ్య గొడవ జరిగగా ఆమె మృతి చెందింది. భర్త హుటాహుటిన ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు

మిగతా 2లో..

సిండికేట్ చక్రబంధంలో ఎక్సైజ్..!

- వ్యాపారులు చెప్పిందే వారికి వేదం
- మద్యం ప్రియుల నడ్డివిరుస్తున్న బెల్ట్
- బార్ అండ్ రెస్టారెంట్లలోనూ వీరబాదుడు

ప్రజాపక్షం/ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ శాఖ మద్యం వ్యాపారుల సిండికేట్ చక్రబంధంలో చిక్కుకుని చేష్టలూడిగి ఏమి జరుగుతున్న చూస్తుండిపోతుంది. మద్యం విక్రయాలు ఎలా జరుగుతున్నా పట్టించుకునే స్థితిలో ఆ శాఖ లేదు. ఎక్సైజ్ శాఖ తీరుపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఉలికే పలికే పనిలో కూడా లేదు. మద్యం వ్యాపారులు చెప్పింది చేయడం తప్ప ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయడం లేదన్న ఆరోపణలను ఎక్సైజ్ శాఖ ఎదుర్కొంటుంది. ఒకరిద్దరు కాదు ఎక్సైజ్ శాఖలో క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఇదే తీరు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ శాఖను గురించి పట్టించుకోవడం మానేశారు. తీరు మారని శాఖకు ఎన్ని సార్లు చెప్పినా ఏముందిలే అన్న భావన వ్యక్తమవుతుంది. మద్యం దుకాణాల్లో విక్రయించే మద్యం కంటే అనేక రేట్లు ఎక్కువ మద్యాన్ని బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాల నిర్వహణలో కొంత మంది మద్యం వ్యాపారులు ఉండగా మరి కొందరు మద్యం దుకాణాలకు ప్రత్యేక వాహనాల్లో మద్యాన్ని సరఫరా చేస్తూ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణాల్లో విక్రయిస్తే ఎంఆర్‌పికి విక్రయించాలి. అదే బెల్ట్‌షాపులకైతే ఎంఆర్‌పిపై పది నుంచి 20ల వరకు అదనంగా విక్రయించవచ్చు. కామేపల్లి మండలంలో మద్యం దుకాణ యజమానులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి గల్లీ గల్లీకి మద్యాన్ని అందిస్తున్నారు. జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి

మిగతా 2లో..

కూల్చిన చోటనే ఇండ్లు కట్టించాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
-జెడ్పి సెంటర్‌లో
వెలుగుమట్ల బాధితుల ఆందోళన,
పలువురి అరెస్టు
-కవితను రూరల్ పోలీస్ స్టేషన్‌కు
తరలించిన పోలీసులు

ప్రజాపక్షం/ఖమ్మం : ఎక్కడ బాధితుల ఇండ్లు కూల్చారో ఆ వెలుగుమట్ల రెవెన్యూలోనే బాధితులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వెలుగుమట్లలో బుల్‌డోజర్లతో ఇండ్లను నేలమట్టం చేసిన ఈ ప్రభుత్వానికి, నాయకులకు బాధితుల ఊసురు తగులుతుందని ఆమె అన్నారు. సోమవారం ఖమ్మం చేరుకున్న ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహరాజ్‌తో కలిసి అంబేద్కర్ భవన్‌లోని వెలుగుమట్ల బాధితులను పరామర్శించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలు దేరి జెడ్పి సెంటర్‌కు

మిగతా 2లో..

కార్మిక సమస్యల పరిష్కారం కోసం పోరుబాట

- 17న నల్లబ్యాడ్జీలతో నిరసన, 18 నుండి ప్రచారజాత
- సంస్థ ఒప్పుకున్న డిమాండ్లు అమలు చేయాలి
- కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి
- వాసిరెడ్డి సీతారామయ్య

ప్రజాపక్షం/ఖమ్మం : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరుబాట తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక శేషగిరి భవన్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

మిగతా 2లో..

జల ప్రళయానికి సాక్షిగా ముల్కలపల్లి వంతెన

-ప్రారంభం కాని వంతెన పునర్ నిర్మాణ పనులు

ప్రజాపక్షం/ఖమ్మం : 2024 సెప్టెంబర్ ఒకటిన సంభవించిన జల ప్రళయానికి ఆకేరు, మున్నేరు పరివాహక ప్రాంతం అతలాకుతలమైంది. వేలాది కుటుంబాలు వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోగా రాకాసితండా వంటి గ్రామాల భౌతికస్థితినే మార్చివేసింది. పరివాహక ప్రాంతాల్లోని

మిగతా 2లో..

సిండికేట్ చక్రబంధంలో ఎక్సైజ్..!

(మొదటిపేజీ తరువాయి)

బెల్ట్‌షాపుల యజమానులు మద్యం దుకాణాల వారు విక్రయించిన దానిపై మరో 20 నుంచి 30లు అదనంగా వేసి మద్యం ప్రియులను పిండేస్తున్నారు. బెల్ట్‌షాపుల నిర్వహణకు సంబంధించి సమస్త సమాచారం ఎక్సైజ్ యంత్రాంగానికి తెలుసు. అప్పుడప్పుడు నామమాత్రపు దాడులను నిర్వహిస్తారు. ఉమ్మడిజిల్లాలో ఏ గ్రామంలో ఎక్కడ బెల్ట్ షాపు ఉందో తెలిసి కూడా చూస్తుండిపోతున్నారు. అప్పుడప్పుడు మేము వస్తున్నామంటూ సమాచారం ఇచ్చి దాడులకు వెళ్తారు. ఏమి దొరకలేదని ఓ నిట్టూర్పుతో బయటకు వచ్చి మిగతా తతంగాన్ని పూర్తి చేస్తారు. ఎక్సైజ్ శాఖ మొత్తం సిండికేట్ గుప్పెట్లోనే నడుస్తుంది. సిండికేట్‌లో ఉన్న మద్యం వ్యాపారులు మొత్తం ఎక్సైజ్ శాఖను తమ నియంత్రణలోకి తెచ్చుకుని ఇష్టానుసారంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యాన్ని బయటకు విక్రయించకూడదు కానీ యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారు. ఇక ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ శాఖలో ప్రోహిబిషన్‌ను పూర్తిగా మరిచిపోయారు. ఖమ్మం నడిబొడ్డున నాటు సారా విక్రయాలు జరుగుతున్న ఆ శాఖ పట్టించుకునే స్థితిలో లేదు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలి. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి అధికారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే మద్యం వ్యాపారులకు సహకరిస్తున్న తీరు బట్టబయలవుతుంది. సిండికేట్ మాటున జరుగుతున్న అక్రమాలకు ఏఏ అధికారులు వత్తాసు పలుకుతున్నారో కూడా అవగతమవుతుంది.

కార్మిక సమస్యల పరిష్కారం కోసం పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 17న మూడు షిఫ్టుల్లో నల్లబ్యాడ్జీలతో కార్మికులు నిరసన చేపడతారని, యాజమాన్యం తప్పించుకునే దోరణులను ప్రదర్శిస్తు,ండటంతో కార్మికులకు సమస్యలను వివరించేందుకు 18వ తేదిన శ్రీరాంపూర్ నుండి ప్రచార జాతా ప్రారంభిస్తామని తెలిపారు. ఈప్రచార జాతా సింగరేణి 12 ఏరియాల్లో కలియతిరిగి కార్మికులకు అవగాహన కల్పించనుందన్నారు. అన్ని యూనియన్లను కలుపుకుని ఏప్రిల్ 1, 2 వారాల్లో ఒక్కరోజు టోకెన్ సమ్మెను నిర్వహిస్తామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం నవంబర్ 2024, మార్చి 2025లో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో పలు డిమాండ్లను అంగీకరించిందని, కానీ ఆ డిమాండ్లు నేటికి కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రధానంగా కార్మికుల సొంతిటి పథకాన్ని అమలు చేయాలని పెర్క్స్‌పై ఇన్ కంటాక్స్‌ను కోల్ ఇండియా మాదిరిగానే సింగరేణి యాజమాన్యమే చెల్లించాలని, ఇప్పటి వరకు కూడా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకుండా ఏసిబి విచారణ పేరుతో నిలుపుదల చేశారని మండిపడ్డారు. అనారోగ్యాల కారణంగా చాలా మంది కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తులు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా వారిని మెడికల్‌కు పిలవకుండా కార్మికులను మనోవేదనకు గురిచేస్తున్నారన్నారు. మారు పేర్ల సమస్య తీవ్రంగా ఉందని, ఆ సమస్యను యాజమాన్యం పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, కానీ నేటికి అది కార్యరూపం దాల్చకపోవడంతో వారసులకు ఉద్యోగాలు రావడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనరల్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుల జీతం రికవరీ చేస్తామని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దానిని వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కొత్తగనులు ఇవ్వకుండా తెలంగాణలోని సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని, వేలంతో సంబంధం లేకుండా తెలంగాణలో ఉన్న కొత్తగనులు సింగరేణికి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సంస్థలో మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్మెన్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ మనుగడ కోసం ఎంతో కష్టపడుతున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రాకపోవడం విచారకరమని, సమస్య పరిష్కారానికి చొరవచూపకుంటే ఆందోళన తప్పదని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి వి మల్లిఖార్జున రావు, సహాయ కార్యదర్శులు గట్టయ్య, రాము, ఉపాధ్యక్షులు క్రిష్టాఫర్, ఎర్రగాని కృష్ణయ్య, లక్ష్మీ నారాయణ, సందెబోయిన శ్రీనివాస్, హుమాయూన్, జాన్ నర్సయ్య, మండలి రాజేశ్వరరావు, బండారి మల్లయ్య, తిరుపతి, సోమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

-జిల్లా కలెక్టర్ అంకిత్

ప్రజాపక్షం/ములకలపల్లి: జిల్లాలోని వసతి గృహ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ములకలపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, మూకమామిడి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదులు, వంటశాల, భోజనశాల, మరుగుదొడ్లు, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, భవిష్యత్ లక్ష్యాలపై ఆరా తీశారు. పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను కూడా పరిశీలించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని, త్రాగునీటి నాణ్యతను పర్యవేక్షించాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇంటర్మీడియల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు పూర్తైన తర్వాత ఏ కోర్సులు చదవాలని భావిస్తున్నారు. భవిష్యత్తులో ఏ లక్ష్యాలు పెట్టుకున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని ఉన్నత విద్యలో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్‌లో స్నాక్స్ అందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి, ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీడీవో, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐటిలో మహిళా దినోత్సవం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్‌బిఐటి కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా జాయింట్ సెక్రటరీ గుండాల కవిత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో స్త్రీలదే కీలక పాత్ర అన్నారు. అణిచివేత, అసమానతలను తొలగించుకుంటూ నేడు ఆకాశంలో సగం అవకాశాల్లో సగమని ఉద్యమించే స్థాయికి ఎదిగడానికి స్త్రీమూర్తులు పోరాడారని కొనియాడారు. మహిళలు తమపై తాము నమ్మకం కలిగి ఉండాలన్నారు. తద్వారా స్వయంశక్తిగా ఎదిగే అవకాశం ఉంటుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. 15వేల మంది మహిళలతో ఆరంభమైన మహిళ ఉద్యమం నేడు ప్రపంచ వ్యాప్తంగా మహిళా దినోత్సవం జరుపుకునే స్థాయికి వచ్చిందన్నారు. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మహిళ అభివృద్ధితోనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం

విద్యార్థినులు నృత్య ప్రదర్శన, సాంప్రదాయ వేషధారణ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, మహిళా అధ్యాపకులు కె. స్ఫూర్తి, సుప్రియ మీనన్, పద్మావతి, యోజన, నాగమణి, సవిత, సరిత, గ్లోరి విక్టోరియ, హిమబిందు, మీనా, సాహిస్తా మీర్జా, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిది హత్యా, ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షించడంతో అప్పటికే మృతి చెందిందని తెలిపారు. దీంతో కవిత మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, మృతదేహం వద్దకు వచ్చి బోరున విలపించారు. నాగేశ్వరరావే కవితను హత్య చేసి ఆత్మహత్యకా చిత్రీకరించాడని ఆరోపిస్తున్నారు. ఆతనికి ఉన్న అక్రమ సంబంధాన్ని కవిత నిలదీస్తుందనే అక్కసుతునే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని బంధువులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబీకుల ఫిర్యాదు ఆధారంగా 1 టౌన్ సిఐ కరుణాకర్ కేసు నమోదు చేశారు. అప్పటికే నాగేశ్వరరావు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇదిలా ఉండగా మృతురాలు కవితి భద్రాచలంలో స్కూల్ అసిస్టెంట్‌గా, నాగేశ్వరరావు బూర్గంపాడులో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కవితది హత్యా, ఆత్మహత్యా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

కూల్చిన చోటనే ఇండ్లు కట్టించాలి

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్నారు. జెడ్పి సెంటర్‌లో ఆందోళనకు దిగారు. చాలాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఆందోళనకారులను ఉద్దేశించి కవిత మాట్లాడుతూ బుల్‌డోజర్లతో పేదల నివాసాలను నేలమట్టం చేశారని ఆమె ఆరోపించారు. పేదల ఇండ్లను కూల్చే హక్కు ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారని కవిత ప్రశ్నించారు. బాధితుల వేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని పరీక్షల సమయంలో ఇండ్లు కూల్చడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీశారన్నారు. గతంలో ఇండ్లు కూల్చే ప్రయత్నం చేసినా బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పాపాలు కడుక్కునే ప్రయత్నంలో ఉన్నారని కవిత ఆరోపించారు. తాను ఎక్కడున్న పేదల పక్షానే ఉంటానని వెలుగుమట్ల బాధితుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వారి పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ సమస్యపై జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడడం లేదని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదల మీద జులుం నడుస్తుందని ఆమె తెలిపారు. పేదల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. వెలుగుమట్ల బాధితులను రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించగా కవితను ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె అరెస్టు పై జాగృతి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీసులు లేకుండా అరెస్టు చేశారని, అసభ్యంగా ప్రవర్తించారని దీనిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు జాగృతి నాయకులు తెలిపారు. అంతకు ముందు అంబేద్కర్ భవన్ నుంచి జెడ్పి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

జల ప్రళయానికి సాక్షిగా ముల్కలపల్లి వంతెన

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ భూములు కోతకు గురికావడమో, మేటలు వేయడమో జరిగింది. ఆ ప్రళయం నుంచి తెరుకుంటున్న మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలను కలుపుతూ ఆకేరుపై నిర్మించిన హైలెవల్ వంతెన పునర్ నిర్మాణ పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. సెప్టెంబర్ ఒకటి 2024 నాడు సంభవించిన వరదలకు వంతెన పైభాగం మొత్తం కొట్టుకుపోయి వంతెన స్వల్ప భాగం మాత్రమే మిగిలింది. అప్పటి వంతెనకు సజీవ సాక్షిగా పిల్లర్ల పక్కనే వంతెన శిథిలాలు మిగిలాయి. ఏడాదిన్నర దాటిన ఇంత వరకు పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. రెండు జిల్లాలను కలిపే అతి ప్రధాన మార్గంగా ఉన్న ఈ రహదారిపై రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదు. ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మార్గం చిన్నపాటి వర్షానికి మునిగిపోతుంది. పెద్ద వర్షంకురిస్తే రోజుల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. చుట్టూ తిరిగి తనగంపాడు వంతెనపై వెళ్లాల్సి వస్తుంది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో పాటు ఖమ్మం,మహబూబాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులు ముల్కలపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగినందున ఇప్పటికైనా తక్షణం స్పందించి నిధులుమంజూరు చేయాలనికోరుతున్నారు.

రసాభాసగా కాచవరం గ్రామ సభ

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని కాచవరం గ్రామంలో సోమవారం జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. సర్పంచ్ షేక్ ఫాతిమాభి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో రూ.10లక్షలు ఈజిఎస్ నిధుల ద్వారా మంజూరైన ఈఓ బిల్డింగ్‌ను నిర్మించుకునేందుకు స్థలం ఎంపిక కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గత గ్రామ సభ తీర్మానంలో ఈఓ బిల్డింగ్ గ్రామపంచాయతీ ఆవరణంలో నిర్మించే విధంగా సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపారు. దీనిపై గ్రామంలోని కొందరు గ్రామ అవసరాలకు ఉపయోగపడుతున్న గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈఓ బిల్డింగ్ నిర్మించటానికి వీలులేదని, వేరే చోట నిర్మించాలని పట్టుపట్టారు. సర్పంచ్ ఫాతిమాభి గ్రామస్తులకు నచ్చ చెప్పేందుకు విశ్వప్రయత్నం చేసినా ఇరువర్గాల వారు వినకుండా పరస్పరం వాగ్వాదం చేసుకున్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ద్వారా గ్రామ అభివృద్ధి సాధించాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యానని, అయినా గ్రామ కాంగ్రెస్ నాయకులే అభివృద్ధి పనులకు అడ్డగిస్తున్నారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిఓ సూచనకు ఇరువర్గాలు అంగీకరించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ రాయల రామచంద్రరావు, కార్యదర్శి నర్సింహారావు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్ అందించాలి

-మార్చి 14 వరకు గ్లకోమా పై అవగాహన కార్యక్రమాలు
- వ్యాక్సినేషన్‌పై సూచనలు జారీ చేసిన అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అర్హులైన బాలికలకు పూర్తి స్థాయిలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ అందించాలని అదనపు జిల్లా కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంపై జిల్లా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మంజిల్లా ఆసుపత్రిలో మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించడం జరిగిందన్నారు. 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరాల వరకు వయస్సు ఉన్న బాలికలకు హెచ్‌పివి టీకా అందించడం ద్వారా గర్భాశయ ముఖ ద్వారా వచ్చే క్యాన్సర్‌ను కట్టడి చేసే అవకాశం ఉందన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పిహెచ్‌సి లు నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కల్లూరు, మధిర, సత్తుపల్లి, వైరా ఏరియా ఆసుపత్రి నందు ప్రతి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాక్సినేషన్ అందిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరం లోకి వస్తున్న ఆడపిల్లలందరూ వారి తల్లిదండ్రులతో ఏదైనా పిహెచ్‌సి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లి తప్పనిసరిగా హెచ్‌పివి వ్యాక్సినేషన్ తీసుకునేలా మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాలికల తల్లిదండ్రుల ఆమోదంతో హెచ్‌పివి టీకా వేస్తామని జిల్లా వ్యాప్తంగా 11460 మంది బాలికలు ఉండవచ్చునని అంచనా ఉందని వీరందరికీ వ్యాక్సిన్ అందించాలని తెలిపారు. మార్చి 14 వరకు గ్లకోమ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటిపై ఎటువంటి ఒత్తిడి ఉన్న పరిశీలించి అవసరమైన చికిత్స తీసుకోవాలన్నారు. గ్లకోమపై ప్రజలకు అవగాహన కల్పించేవిధంగా అవసరమైన ఐఈసి మెటీరియల్ తయారు చేసి గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించాలని అదనపు కలెక్టర్ డిఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు,జిల్లా అధికారులు , కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పివి టీకా

ఎమ్మెల్యే రాగమయి

ప్రజాపక్షం/సత్తుపల్లి: బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ టీకా(హ్యూమన్ పాపిలోమా వైరస్) ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, ఈ టీకాతో బాలికలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్. పట్టణంలోని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, మండల పరిధిలోని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్వయంగా బాలికలకు టీకా వేశారు. హెచ్‌పీవీ టీకా సింగిల్ డోస్‌గా ఒక్కరికి 0.5 మి.లీ మోతాదులో ఇస్తారని తెలిపారు. ప్రతి టీకా డోస్‌కు పూర్తి బాధ్యత ఉండాలని, టీకా వృథా కాకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీకా వేయించే ముందు బాలికలు ఖాళీ కడుపుతో ఉండకూడదని, వయస్సును ఫోటో ఐడీ ద్వారా నిర్ధారించాలని తెలిపారు. అలాగే యూవిన్ పోర్టల్‌లో ఓటీపీ కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకుల మొబైల్ నంబర్ అందుబాటులో ఉండాలని సూచించారు. ఇప్పటికే టీకా తీసుకున్న బాలికల వివరాలను యూవిన్‌లో నమోదు చేయాలని తెలిపారు. టీకా అనంతరం బాలికలను కనీసం 30 నిమిషాలు పరిశీలనలో ఉంచడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాపక్షం/సత్తుపల్లి: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా నెలకు రూ.10 వేల వేతనంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) జిల్లా గౌరవ అధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాసరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నిమ్మటూరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. 2026 బడ్జెట్‌లో ఇందుకు అవసరమైన నిధులను కేటాయించి వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటియూసి ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు తాళ్లూరు లక్ష్మి , జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెపొంగు మల్లేష్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. అలాగే మెనూ చార్జీలు పెంచడంతో పాటు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహిమున్నీసా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహాదేవ లక్ష్మి , జిల్లా కమిటీ సభ్యురాలు జక్కంపూడి వెంకటలక్ష్మి , సీతమ్మ, పూచి రమణ, వెంకటమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మపథకంపై రైతులకు శిక్షణా కార్యక్రమం

ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ మండలం ముష్టికుంట్ల రైతు వేదికలో ఆత్మపథకంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు స్వర్ణవిజయచంద్ర మాట్లాడుతూ రైతులు విచ్చల విడిగా యూరియా వినియోగించటం వలన భూమి, నీరు, వాతావరణం కాలుష్య అవుతుందని, రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని కోరారు. పంటలో ఎరువులు ఎప్పుడు వేసుకోవాలి, యూరియా, నానోడిఎపి వల్ల ఉపయోగాలు, అధిక సాంద్రత పత్తి వల్ల ఉపయోగాలు, నిషేధిత పత్తిపై వివరించారు. గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పంటల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధిక దిగుబడి సాధించాలని కోరారు. ఇఫ్కో కంపెనీ వారు డ్రోన్లు ఎలా ఉపయోగించాలని డెమో వేసి చూపించడం జరిగింది. అలాగే కుసుమ్ పథకం కింద బోనకల్ మండలంలో సోలార్ పంప్ సెట్‌లను ఉచితంగా అందిస్తుందని, రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా టిజి రెడ్కో మేనేజర్ అజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు పాపారావు, నల్లమోతు సత్యనారాయణ, ఎఈఓ త్రివేణి, ఇఫ్కో మేనేజర్ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేకు ప్రతిఒక్కరూ హాజరు కావాలి

ప్రజాపక్షం/వైరా: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని వైరా తహశీల్దార్ సురేష్‌బాబు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం నందు గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యల విన్నతులు తీసుకున్నారు. అనంతరం తహశీల్దార్ సురేష్‌బాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తప్పకుండా గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరు కావాలని, ఎవరైనా రాకపోతే వారి వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించడం జరుగుతుందని అన్నారు.

ఉత్తమ రైతు అవార్డులు

ప్రజాపక్షం/వైరా: జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ వారు కోరమాండల్ ఇంటర్నేషనల్ తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయశాఖ వారు మెగా రైతు మేళా 2026 మార్చి 8, 9 తేదీల్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన అభ్యుదయ రైతులకు వివిధ విభాగాల్లో ఉత్తమ రైతు పురస్కారాలు పంచాయి. ఈ ఉత్తమ రైతు పురస్కారాలను మంత్రి సీతక్క చేతుల మీదుగా ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి గ్రామానికి చెందిన నల్లమల వెంకటేశ్వరరావు, నేలకొండపల్లి మండలం మేడేపల్లికి చెందిన పి.భాస్కర్, విత్తన ఉత్పత్తి నందు, సత్తుపల్లి మండల తాళ్ల మండల గ్రామానికి చెందిన వెంపటి లక్ష్మీ నారాయణ ఆయిల్‌ఫామ్ సాగులో అందుకున్నారు అని పిజెటిఎయు వైస్ ఛాన్సలర్ ఏ.జానయ్య, కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాటి సుచరితాదేవి తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం గరికపాడులో జెడ్పిహెచ్ హైస్కూల్ నందు ప్రత్యేక కమీషనర్, ఎక్స్ ఆఫీసియో ప్రత్యేక కార్యదర్శి సిహెచ్.ప్రియాంక పుట్టినరోజు సందర్భంగా పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడివో తేజావత్ సక్రియ పాల్గొని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వార్డు మెంబర్లు, హెచ్ఎం సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సురేస్‌బాబు, నేనున్నా మహిళ మోడల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు మెరుగు మానస, కొండ విజయకుమారి, మెరుగు రత్నరాజు, మల్లెల శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాపక్షం/చింతకాని : గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్దిదారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని నర్సింహాపురం సర్పంచ్ లోయ ఉపేందర్ అన్నారు. సోమవారం నర్సింహాపురం అంగన్‌వాడీ 3 సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పిల్లల పెంపకం , ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్యవివాహాల నిర్మూలనలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొడ్డా వీరబాబు, వార్డు సభ్యులు, ఏఎన్ఎం రజని, ఆశ కార్యకర్త జయమ్మ, అంగన్‌వాడీ టీచర్ కర్రి రేణుక , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాపక్షం/చింతకాని : పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి తిమ్మినేనిపాలెం గ్రామ ఉపసర్పంచ్ కూచిపుడి బుచ్చిబాబు పేర్కొన్నారు. సోమవారం తిమ్మినేనిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి చదువు నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ మీరా సాహెబ్, ప్రధానోపాధ్యాయులు చిరంజీవి , భిక్షం, నహీమ్ పాషా, కిసోర్, గీత , విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకట కోటయ్య కుటుంబానికి పరామర్శ

ప్రజాపక్షం/మణుగూరు : మణుగూరు మండలానికి చెందిన జేతంచర్ల వెంకట కోటయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం వారి నివాసానికి వెళ్లి కోటయ్య పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వెంకట కోటయ్య మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, 14 టౌన్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, పోలమూరి రాజు, దొడ్డపనేని మధు, జర్పుల జగన్, మహబూబ్, కొర్లకుంట అప్పారావు, డి శ్రీను, హరి కృష్ణ, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరియాల చైతన్య నాయుడు, అజిత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయాన్ని దర్శించుకున్న దంపతులు

ప్రజాపక్షం/భద్రాచలం : లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ ఇడ్మిన్‌స్ట్రేషన్ న్యూఢిల్లీ డైరెక్టర్ శ్రీరామ్ దంపతులు సోమవారం రామాలయాన్ని దర్శించుకున్నారు. ఈ మేరకు ఈఓ దామోదర్‌రావు, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. ముందుగా బలిపీఠం వద్ద పూజలు చేసిన వారు గర్భగుడిలోని స్వామిని వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ప్రాంగణంలోని లక్ష్మీ తాయారమ్మ, అభయాంజనేయ స్వామి వారి ఆలయాలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు వారికి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని సందర్శించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కట్టుబాట్లు పొందు పరిచిన తీరు చూడముచ్చటగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, లైజన్ ఆఫీసర్ మహేష్, తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిరిజన మ్యూజియాన్ని తిలకించిన ఆయన అక్కడ పొందు పరిచిన కళాఖండాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

గిరిజనులకు సంక్షేమఫలాలు అందేలా కృషి

ప్రజాపక్షం/భద్రాచలం : అర్హులైన గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేయనున్నట్లు ఐటిడిఏ ఏపిఓ జనరల్ డెవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరైన ఆయన పలు ప్రాంతాల గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వాటిని ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేశారు. ఈ సందర్భంగా డేవిజ్ రాజు మాట్లాడుతూ అందిన ప్రతీ దరఖాస్తును రిజిష్టర్‌లో నమోదు చేయాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర వివేదికలు అందించాలని చెప్పారు. వారికున్న సమస్యలు అధికారుల ద్వారా పరిష్కారం అవుతాయని సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి ఇక్కడిదాకా వచ్చి విన్నపాలు సమర్పిస్తుంటారని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సున్నం రాంబాబు, ఇఇ మధుకర్, లక్ష్మీ నారాయణ, వేణు, ఉదయ్, లింగా నాయక్, సర్పంహారావు, ప్రమీలాబాయ్, ఆది నారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రవన్న పదవ వర్ధంతి సభను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ అలియాస్ రవన్న పదవ వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఖమ్మం జిల్లా డివిజన్ నాయకులు గుగులోత్ తేజా నాయక్ మాట్లాడుతూ మార్చి 10న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రవన్న పదవ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కార్యకర్తలు, ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు పుల్లకాని సత్తిరెడ్డి, ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రావుల నాగేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ మండల నాయకులు రాము, మహిళా సంఘం నాయకురాలు రంగి, శుక్లాల సుగుణలయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వెలుగుమట్ల భూదాన్ భూములకు చెందిన సిరికొండ కళ్యాణి తన ఇల్లు కూల్చివేశారని తనకు ప్రభుత్వం తరుపున సాయం అందించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం సారధినగర్‌కు చెందిన గాలి నాగేశ్వరమ్మ తాము 40 ఏళ్లుగా నివసిస్తున్న ఇంటిని రోడ్డు విస్తరణలో తొలగించాలని చూస్తున్నారని తమకు వేరే చోట ఇంటిని మంజూరు చేసి ఆర్థిక సాయం అందించాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం కోమట్లగూడెం సర్పంచ్ కొండూరి పరుశుద్దరావు గ్రామంలో రైతులు పండించిన మొక్కజొన్న మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరానికి చెందిన దళితవర్గీయులు గత ప్రభుత్వంలో 320 మంది లబ్దిదారులకు దళిత బంధు నిధులు మంజూరై ఉన్నాయని వాటిని తమకు మంజూరు చేసి యూనిట్ల ఏర్పాటుకు సహకరించాలని దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు రవన్న ఆశయసాధనకై ఉద్యమిద్దాం

ప్రజాపక్షం/జూలూరుపాడు: ఆదర్శప్రాయుడు రవన్న ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడు మండల పరిధిలో గుండెపుడి గ్రామంలో మండల కార్యదర్శి బానోతు ధర్మ అధ్యక్షతన జరిగిన రవన్న పదవ వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ రవన్న ప్రజా పంథా బాటను, విధానాన్ని నమ్మి ఆచరించారని, అతివాదా మితవాద పెడదోరనులను వ్యతిరేకించాడని, ప్రతి కార్యకర్త ప్రజలతో మరింత సన్నిహితంగా అభిమాన నాయకులుగా ఎదగాలని కోరుకున్నాడని అన్నారు. తన ప్రత్యేక కృషి ద్వారా ఎందరినో కార్యకర్తలను, నాయకులను, సానుభూతిపరులను తయారు చేశాడని, నిత్య కృషివలుడు జీవితాన్ని విప్లవానికి సార్థకంగా మల్చుకున్నాడని కొనియాడారు. న్యూడెమోక్రసీ పార్టీ నుండి మాస్ లైన్ పార్టీలో చేరిన రవన్న వర్ధంతి సభ సందర్భంగా గుండెపుడి గ్రామానికి చెందిన న్యూడెమోక్రసీ పార్టీ కార్యకర్తలు జాటోత్ నరసింహా రావు, కుంచం జమలయ్య ల ఆధ్వర్యంలో 10 కుటుంబాల వారు మాస్ లైన్ పార్టీలో జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారికి ముద్ద బిక్షం కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్ధసభ్యులు జాటోతు కృష్ణ, పార్టీ జిల్లా నాయకులు ఏధులాపురం గోపాలరావు, బానోతు ధర్మ, పెద్ద బోయిన సతీష్ , మేదుదుల రాజశేఖర్, రాయల సిద్ధు తోటకూరి నరేష్, కుంచం జమలయ్య, జాటోత్ నరసింహారావు, పైదా వెంకటేశ్వర్లు, ఇరప రాజు తదితరులు పాల్గొన్నారు.

కస్నాతండాలో ఇసుక తోడేళ్లు..!

- ఆకేరు నుంచి అక్రమంగా తొవ్వుతూ ట్రాక్టర్లతో తరలింపు
- రూ.4వేలకు ట్రక్కు చొప్పున అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న వైనం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం కస్నాతండా గ్రామంలో ఇసుక రోడేళ్లు రెచ్చిపోతున్నాయి. అక్కడి ఆకేరులో నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ నుంచి జీపీఓ ఉన్నప్పటికీ ఇంతలా అడ్డగోలు వ్యవహారం కొనసాగిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇసుకాసరులు అక్రమంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్ ట్రక్కుకు నాలుగు వేల చొప్పున అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇ ఇసుకను గ్రామాలలో ఇండ్లు, కట్టుబడి నిర్మాణాలకై అమ్ముతున్నట్లు తెలిసింది. ఇలా ఇసుకను తోడుతుండటంతో భూగర్భజల వనరుల తగ్గి నీటి ఎద్దడి సమస్యతో బావులు ఎండిపోత్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. రాబోయేది అసలే ఎండాకాలమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టింపులేని తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై జీపీఓ కవితను వివరణ కోరగా...ఇసుక తరలింపు విషయం నా దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా బోనకల్ బస్టాండ్..!

- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులు

ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ ఆర్వోబి బ్రిడ్జి కింద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతి రోజూ వందలాది మంది ప్రయాణీకులు ఈ ప్రాంతం నుంచే బస్సులు ఎక్కుతూ దిగుతూ ఉండగా అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో పాత అర్టిసి బస్టాండ్ ఉన్నప్పటికీ ప్రస్తుతం కొత్త బ్రిడ్జి నిర్మాణం తర్వాత సరైన ప్రణాళిక లేకుండా బస్సులను బ్రిడ్జి కింద ఆపుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. బ్రిడ్జి కింద రహదారి చాలా సన్నగా ఉండటంతో బస్సులు ఆగిన ప్రతిసారి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఒక వైపు బస్సులు, మరో వైపు లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఈ ప్రాంతంలో బస్సులు ఎక్కే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణీకులు రహదారిపైనే నిలబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా బ్రిడ్జి నిర్మాణం నాణ్యతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్రిడ్జి గోడల వద్ద బీలికలు కన్పిస్తున్నాయని, వర్షపు నీరు జారిపడుతూ నిర్మాణంలో లోపాలు బయటపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిశీలన చేపట్టి అవసరమైన మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజలు, ప్రయాణికులు పలుమార్లు అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. బోనకల్ వంటి రద్దీ ప్రాంతంలో సరైన బస్టాండ్ ఏర్పాటు చేయకుండ బ్రిడ్జి కింద బస్సులు నిలిపివేయడం ప్రజల ప్రాణాలతో ఆటలాడటమే నని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రయాణీకుల కోసం ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరగవచ్చని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

అరసం అధ్యక్షులుగా కొంపల్లి

ప్రజాపక్షం/ ఖమ్మం : అభ్యుదయ రచయితల సంఘం మహాబూబాబాద్, ఖమ్మం జిల్లాల సంయుక్త కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా కొంపల్లి రామయ్య, ప్రధాన కార్యదర్శిగా అంగోతు జయవాసు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా తోటపల్లి సృజన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సూరం ఉపేందర్‌రెడ్డి, వెంకటలక్ష్మి , రాజేందర్, సాధన, సుశీల, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా యాకస్వామి, మోదుగు గోవింద్, కోతాధికారిగా కొత్తపల్లి కృష్ణారావు లను ఎన్నుకున్నారు. రానున్న కాలంలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సమాజ చైతన్యానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

మహిళా రచయిత్రులకు సన్మానం...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో పలువురు అభ్యుదయ మహిళా రచయితలకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరసం, రాష్ట్ర అధ్యక్షులు పల్లెర వీరన్నాయి లు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనించి ప్రజా చైతన్యానికి విరివిగా రచనలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అరసం , రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవివిజే మాట్లాడుతూ సోషలిస్టు సమాజ నిర్మాణానికి అభ్యుదయ రచయితలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధం మేఘాలు కమ్ముకున్న వేళ సమాజంలో శాంతిని పెంపొందించేలా రచయితలు తమ కలం ఎత్తాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షులు సాధనాల వెంకటస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మి , గాజుల భారతి, విక్టోరియా, కాళంగి వసంత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అథ్లెటిక్స్‌లో రాణించాలి

ప్రజాపక్షం/పాల్వంచ : అథ్లెటిక్స్‌లో పురుషులతో పాటు మహిళలు రాణించాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురం లలితకుమారి అన్నారు. పాల్వంచ శ్రీనివాస కాలనీలో గల జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రిలే కార్నివాల్ అథ్లెటిక్స్ ఎంపికలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జెండా ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు చురుకుగా క్రీడల్లో పాల్గొన రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.జిల్లా నలుమూలల నుండి వందల మంది క్రీడాకారులు రావటం అభినందనీయమన్నారు. టీవల నిర్వహించి రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు కప్ సాధించి జిల్లా కు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా రా ష్ట్ర, జాతీ య స్థాయిలో పతకాలు సాధించి జిల్లా పేరును దేశవ్యాప్తంగా మారుమోగించాలని కోరా రు. విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ మాట్లాడుతూ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనభరిచిన క్రీడాకారులను ఈ నెల 15వ, తేదీన హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ పి. నాగేంద్ర, పిటీలు ఎర్రయ్య, శేత తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో కేజీబీవీ ఉపాధ్యాయుల నిరసన

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు కేజీబీవీ పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమగ్ర శిక్ష, కేజీబీవీ, యుఆర్ ఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్‌వోలను ప్రిన్సిపాల్‌లుగా, పీజీసీఆర్‌టీలను జూనియర్ లెక్చరర్లుగా, సీఆర్‌టీ, పీతఆటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పరిగణించి కనీస మూల వేతనం చెల్లించాలని, నిలువుదల చేసిన వేతనాలను విడుదల చేయాలని, హెల్త్ కార్డులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కేజీబీవీ పాఠశాలలో కేర్ నెట్ వాచ్‌మెన్‌లను నియమించాలని కోరారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు బి బాలు, సహాధ్యక్షుడు టి రమేష్, సహాయ కార్యదర్శి ఎస్ జనార్దన్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుశీల, సిబ్బంది పరమేశ్వరి, దివ్య చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తా..

ప్రజాపక్షం/పాల్వంచ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని 41వ, డివిజన్ సిపిఐ కార్పోరేటర్ గొర్లె అన్నపూర్ణ అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ పాల్వంచ 41వ, డివిజన్‌లో ప్రజాపాలన, ప్రగతి ప్రజాభేరి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. వీధులను శుభ్రం చేసి, డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తను తొలగించి క్లీన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోట్ల నిధులను మంజూరు చేయించి కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సహకారంతో డివిజన్‌లోని పెండింగ్ సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సరేష్‌నాయుడు, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- ప్రజలతో మమేకమై : ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడతానని 36వ, డివిజన్ సిపిఐ కార్పోరేటర్ నామా కీర్తి అన్నారు. డివిజన్ పరిధి జ్యోతినగర్‌లో పర్యటించారు. పార్కును తనిఖీ చేశారు. సమస్యలపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకొన్నారు. అనంతరం గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని అన్నారు. డివిజన్ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో నామా పండు, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సంసిద్ధత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల 287 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైకాలజిస్ట్ కొత్తపల్లి సుప్రియ మాట్లాడుతూ ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని, పరీక్షల వరకు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. మోటివేషనల్ స్పీకర్ సునీత విద్యార్థులు లక్ష్యంతో చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్కేలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శంకర్ మహమ్మద్ వన్, గాయం వెంకటేశ్వర్లు, సాంఘిక గురుకుల పాఠశాల నుండి బాలకృష్ణ, సుధాకర్, గిరిజన సంక్షేమ పాఠశాల నుండి ప్రిన్సిపాల్ చైతన్య, కేజీబీవీ పాఠశాల సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు శిరీష, నాగమణి, తొలి అడుగు ఫౌండేషన్ సభ్యులు స్వాతి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పలువురి కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని కొత్తూరు తండా గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాల సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి వైరా ఎంఎల్‌ఎ మాలోత్ రాందాస్ నాయక్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ రాందాస్ నాయక్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పార్టీలో తారతమ్యాలు లేకుండా అందరూ కలిసిమెలిసి పని చేసి ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ధరావత్ బిచ్చు, మదంపల్లి గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు సుమన్ నాయక్, బానోతు లక్ష్మీ, ధరావత్ హీరలాల అజ్మీర్ బాబూలాల్, అమర్‌సింగ్, మోహన్, భూక్య రవి, రాజు, రవి, వెంకటేష్, రమేష్, బాబూలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఏడీఈగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డి

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి(సింగరేణి)మండలంలో అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్న వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(డిపికె)గా పదోన్నతి పొంది మహబూబాబాద్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్(టెక్నికల్)అజ్మీరా వీరలాల్, ఆపరేషన్ డివిజనల్ ఇంజనీర్ కోటేశ్వరరావు, ఏడీఈ ఎస్‌పీఎం భీమ్‌సింగ్, తెలంగాణ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గొల్లపూడి నాగమల్లేశ్వరరావు, గౌరవ సలహాదారు చెల్లా రఘోతం రెడ్డి, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24న దేశ వ్యాప్త ఆందోళనను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/ములకలపల్లి: మండలంలోని ఒడ్డు రామవరం, పూసుగూడెం గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి 24న దేశ వ్యాప్తంగా జరిగే ఆందోళనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ 600 కూలీ, ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మండల అధ్యక్షులు మాలోతు రాధూజ, నాయకులు పులి వెంకటేశ్వర్లు, బొజ్జ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బుగూడెం గ్రామ పంచాయతీకి శాశ్వత కార్యదర్

వ్యవసాయ పంటలకు లిఫ్ట్ ద్వారా నీరందించాలి

ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని చిన్న గోపతి వ్యవసాయ పంట భూములకు వందనం, కొదుమూరు ఎత్తిపోతల పథకం ద్వారా చిన్నగోపతి రెవిన్యూ సర్వేనెంబర్ 76, 77 లో ఉన్న 30 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని కోరుతు సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ జిల్లా అధికారి వెంకట్‌రామ్ కు రైతుసంఘం బృందం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు మిడికంటి వెంకటరెడ్డి మాట్లాడుతు తక్కువ ఖర్చుతో రైతులకు అందుబాటులో ఉన్న ఎత్తిపోతల పథకాలను ఉపయోగపడేలా ప్రభుత్వం నుంచి అధికారులు తన ప్రణాళికలద్వారా సాగునీరు పథకాలను రూపొందించి చేయాలని వారు కోరారు. పైలెట్ ప్రాజెక్టు గ్రామాన్ని గుర్తించారు. కాని అక్కడ కావాలిసన తాగునీరు సాగునీరు అందించడంలో ప్రభుత్వ అదికారులు విఫలమవుతున్నారని వారు ఆరోపించారు. రెవిన్యూ డ్రై ఏరియా కావటం దీన్ని ప్రభుత్వం గుర్తించి సంపూర్ణంగా సాగునీరు తాగునీరు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు పావులూరి మల్లిఖార్జున్, ఏపూరి రవీంద్రబాబు, ఉపసర్పంచ్ రైతుసంఘం మండల అధ్యక్షుడు దేరంగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి ఉపేందర్ అడప కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకానికి తూట్లు పొడుస్తున్న బిజెపి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి

ప్రజాపక్షం/వైరా: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకానికి తూట్లు పొడుస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. సోమవారం వైరా మండలం స్నానాల లక్ష్మీ పురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో నూతి సత్యనారాయణ గౌడ్ ముఖాముఖితో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పనులను పరిశీలించడం జరిగింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా ఉపాధజ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందని అన్నారు. ఎప్పటి నుంచో ఉన్నాయి మహాత్మా గాంధి పేరు మార్చారని, ఇప్పుడు పనిదినాలు సైతం తగ్గించి కూలీల పొట్ట మీద కొడుతున్నారని ధ్వజమెత్తారు. ఉపాధిహామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధి దేశవ్యాప్తంగా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ పురం గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, జంగా జనార్ధన్, వేమలు రత్నాకర్, లక్ష్మీ పురం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి హెచ్‌పివి వ్యాక్సిన్

వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ

ప్రజాపక్షం/వైరా: గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి 14 నుంచి 15 సంవత్సరాల లోపు బాలికల కొరకు హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రభుత్వం అందిస్తున్నట్లు వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం వైరాలోని 13వ వార్డులో ఉన్న వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో హెచ్‌పివి వ్యాక్సిన్ డాక్టర్ కాపా చంద్రకళ సోమవారం వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ప్రధాన వైద్యులు డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కౌన్సిలర్లు ముళ్ళపాటి విజయలక్ష్మి, మాదినేని సునీత, దీరావత్ వెంకటేశ్వర్లు, మోరు శ్రీకాంత్ సోమవారం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ హర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మూడు నెలల వరకు వైద్య విధాన పరిషత్ పరిధిలో గల వైరా ఏరియా నందు అందించడం జరుగుతుంది. 14 నుంచి 15 సంవత్సరాల మధ్య బాలికలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గర్భకోశ క్యాన్సర్ వ్యాధి నివారణ కోసం ఈ వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా బాలికలకు అందిస్తుందని తెలిపారు. హాస్పిటల్ పని దినాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్న 2 గంటల వరకు 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల బాలికలకు వ్యాక్సిన్ అందిస్తారని అన్నారు. 14 సంవత్సరాల బాలికలు ఏజ్‌ప్రూఫ్ కొరకు ఏదైనా ఐడి కార్డు, పేరెంట్స్‌ను తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ వైజాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్య సంరక్షణలో హెచ్‌పివి టీకా ఒక వరం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత

ప్రజాపక్షం/ మధిర : బాలికల ఆరోగ్య సంరక్షణతో సమాజం సురక్షితంగా ఉంటుందని, హెచ్‌పివి టీకా గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు ఒక వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు. సోమవారం మధిరలోని వందపడకల ఆసుపత్రిలో ప్రభుత్వం చేపట్టిన హెచ్‌పివి టీకా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ క్యాన్సర్ వంటి మహమ్మారిని ప్రాథమిక దశలోనే నివారించేందుకు ఈ టీకా ఎంతో దోహదపడుతుందని, టీకా విషయంలో ప్రజల్లో ఉన్న అపోహాలు తొలగించాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉందని అన్నారు. అవగాహనతోనే ప్రాణాంతక వ్యాధులను జయించవచ్చునని, హెచ్‌పివి టీకాపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో వైస్‌చైర్మన్ కోన ధనికుమార్, కౌన్సిలర్లు, ఆసుపత్రి సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభలతో ఘనంగా దేవతల ఊరేగింపు

ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడలో ప్రభలతో దేవతామూర్తులను రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. మూడు రోజులు పాటు రజక సంఘం ఆధ్వర్యంలో దగ్గుల శ్రీనివాసరెడ్డి గ్రౌండ్‌లో పటం కళాకారులు ప్రదర్శించిన హరికథలు అలరించాయి. లోక కళ్యాణం, గ్రామంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ దక్షయజ్ఞం, శివపురాణం, వీరభద్రస్వామి యుద్ధం, మడేలయ్య స్వామి జీవిత చరిత్రను హరికథ రూపంలో కళాకారుడు కొండలరావు బృందం వారు ప్రదర్శించారు. అనంతరం తల్లాడ పురవీధుల్లో ప్రభల ద్వారా దేవతామూర్తులను ఊరేగించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు సందర్భంగా తల్లాడలో దేవతలకు ఇంటింటికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

ఆరోగ్యలక్ష్మిపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాలిటీ 11వార్డు నందు అంగన్వాడీ సెంటర్‌ల్లో ఐసిడిఎస్ సమక్షంలో గర్భిణీ బాలింతలు, పిల్లల తల్లులకు సోమవారం ఆరోగ్య లక్ష్మీ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గద్దల మాధురి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని, సదుపాయాలను గర్భిణీలు, పిల్లల తల్లులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి ఒకపూట సంపూర్ణ భోజనం చేయాలని తెలిపారు. అదే విధంగా 3 సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలను పంపించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఒగ్గు రాణి, వెంకటకుమారి, అంగన్వాడీ వర్కర్ భాగ్యలక్ష్మి , ఆశావర్కర్లు, గర్భిణీలు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

మధిరలో టిఎన్జీవో సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్(టిఎన్జీవో) సంఘం మధిర డివిజన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మధిరలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాంబాబు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి టిఎన్జీవో సంఘం చేస్తున్న సేవలను కొనియాడారు. ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా క్యాలెండర్, డైరీలను ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్, కార్యదర్శి రజనికాంత్, ట్రెజరర్ సాయి, ఈసి సభ్యులు సిహెచ్.శ్రీనివాసరావు, రెవెన్యూ, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని గుబ్బగుర్తి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోని 16 మంది పదోతరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం చిరిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె కరామత్ ఆలి మాట్లాడుతు విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో పరీక్షలు వ్రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షా సామాగ్రి అందజేసిన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత పరిశ పుల్లయ్యకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివన్నారాయణ, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, జగదీష్, లలిత, భారతి, రాంబాబు, సుజాత, వెంకటేశ్వర్లు, పుల్లయ్యచారి, ఏఏపిసి చైర్‌పర్సన్ కె నాగమణి, గ్రామ సర్పంచ్ దంతాల ప్రశాంతి, నరసింహారావు పాల్గొన్నారు.

కెజిబివి ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

ప్రజాపక్షం/కొణిజర్ల : కెజిబివి, యుఆర్ఎస్ సమగ్ర శిక్షా ఉద్యోగులను తక్షణమే విద్యాశాఖలో విలీనం చేసి అప్పటి పేస్కేల్ అమలు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి సమస్యలకోసం మూడు దశాబ్దాల పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈంసదర్భంగా ఆయన మాట్లాడుతు ప్రస్తుతం చాలీచాలని వేతనాలతోకాలం వెళ్లదీస్తు బతుకు కోసం ఉద్యోగం చేస్తున్నారని కుటుంబ పోషణకు కూడా కష్టసాధ్యంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికి స్థిరమైన వేతనం, భద్రత లేకుండా పనిచేయడం భాదాకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని విద్యాశాఖలో విలీనం చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మాదాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు దీధి శ్రీనివాసరావు, కెజిబివి యుఆర్ఎస్ఎస్ఏ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకో టూరిజం పేరుతో పంటలు ఎండబెడుతున్నారు..!

ప్రజాపక్షం/పెనుబల్లి: పులిగుండాల ప్రాజెక్టు ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేసి ఎండుతున్న వరి పంటను కాపాడాలని ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రహ్మాలకుంట గిరిజన మహిళ రైతులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎకో టూరిజం పేరుతో ప్రాజెక్టు నీటిని విడుదల చేయకుండా తమ పంట పొలాలను ఎండుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాల్వా పంటకు నీరు ఇవ్వమని ముందే అటవీశాఖ అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తీరా దాల్వా పంట వేశాక టూరిజం పర్యాటకుల కోసం నీటిని విడుదల చేయడం సాధ్యపడదని అధికారులు అనడం దారుణం అన్నారు. సుమారు 600 ఎకరాలకు పైగా ప్రాజెక్టు వరిపాలలు కలుపు దశకు వచ్చిన తర్వాత ఎండిపోవడం

గిరిజన రైతుల ఆందోళన

వల్ల ఎకరాకు 15 వేల మేరా నష్టం వాటిల్లిందని తమ గోడు ఎవరూ పట్టించుకోవడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 15 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయని కేవలం మూడు అడుగులు నీరు తమ పంట పొలాలకు సరిపోతాయని తక్షణమే నీటిని విడుదల చేసి ఎండుతున్న పంట పొలాలు కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టు నీటినైనా విడుదల చేయండి..

ఎకరాకు రూ. 15,000 నష్ట పరిహారం అయిన ఇవ్వాలి...

పులి గుండాల ప్రాజెక్టు నీటిని తక్షణమే విడుదల చేసి గిరిజనుల పంట పొలాలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు చిట్టి మోదుల కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రహ్మాలకుంట గిరిజన రైతుల పంట పొలాల కోసం ఏర్పాటుచేసిన పులిగుండాల ప్రాజెక్టును ఎక్కువ టూరిజం పేరుతో పర్యాటకుల ఆహ్లాదం కోసం నీటిని పంట పొలాలకు విడుదల చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం దారుణం అన్నారు. నీటిని విడుదల చేయకపోతే ఎండిన వరి పంట నష్టపరిహారాన్ని కింద ఎకరాకు 15000 రూపాయలు తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధి కోసమే 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం

ప్రజాపక్షం/జూలూరుపాడు: గ్రామాల అభివృద్ధి కోసమే 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, అధికారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కొంత మంది సర్పంచ్ లు, పంచాయితీ కార్యదర్శులు, కొన్ని శాఖల అధికారులు సమావేశానికి

సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆసహనం

రాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసి, పని చేయటం ఇష్టం లేక పోతే ఉద్యోగం నుండి తప్పుకోవచ్చన్నారు. ప్రజలు, అధికారులు కలిసి సమిష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనందరికి చేరాలన్నారు. మండల కేంద్రంలో పిహెచ్సి లో చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. త్వరలోనే సిహెచ్సి అప్ గ్రేడ్ కోసం కృషి చేస్తానని అన్నారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పై అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తా న్నారు. సాయిరాంతండా, వెంగన్నపాలెం గ్రామాలలో పూర్తైన ఇంది రమ్మ ఇండ్లను ప్రారంభించారు. త్వరలోనే రెండో దశలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, ఎంపిడిఓ తాళ్ళూరి రవి, ఎంపిఓ తులసీరాం, సిఐ శ్రీలక్ష్మి , ఎస్సై రవి, పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్, సర్పంచ్లు, నాయకులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

ప్రజాపక్షం/అశ్వాపురం: మండల పరిధిలోని తురుములగూడెం గ్రామానికి చెందిన గిరిజన దంపతులుల బానోత్ పుల్లమ్మ, లక్ష్మా తమ భూమిని కొందరు కబ్జా చేశారని ఆరోపిస్తూ సోమవారం హైదరాబాద్ లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి మెమోరాండం సమర్పించారు. 1999లో ప్రభుత్వం గొల్లగూడెం సమీపంలోని సర్వే నెంబర్ 281లో సుమారు 3 ఎకరాలు 10గుంటల భూమిని తమకు కేటాయించిందని తెలిపారు. అయితే కొంత మంది గిరిజనేతరులు ఆ భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ఆరోపించారు. భూమి వద్దకు వెళ్లినా దాడులు చేస్తున్నారని, గత 20 సంవత్సరాలుగా అధికారులను ఆశ్ర యించినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కోరగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా

సేవాలాల్ మండల అధ్యక్షులు మోహన్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధరావత్ కృష్ణ పాల్గొన్నారు.

సహజ వనరులతో ఆర్థిక పురోగతి

ప్రజాపక్షం/పాల్వంచ : గిరిజన ప్రాంతాలలో నిక్షిప్తమైన సహజ వనరులు, స్థానిక నైపుణ్యాలను ఉపయోగించి వ్యాపారాలను అభివృద్ధి చేసినట్లయితే ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని గుంటూరు ఆచార్య యూనివర్సిటీకి చెందిన డీన్ కామర్స్అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఆర్. శివరాం అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలోని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఎంపవరింగ్ ట్రైబల్ కమ్యూనిటీస్ త్రూ ఎంట్రప్రెన్యూర్షిప్ అపర్చునిటీస్ ఛాలెంజెస్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సు మొదటి రోజు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సంధర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివరాం మాట్లాడుతూ గిరిజన సమాజ సాధికారికతతో పారిశ్రామిక అవకాశాల ప్రాముఖ్యను వివరించారు. ప్రభుత్వ పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్ర మాలు మరియు మార్కెట్ అవకాశాలను వినియోగించటానికి గిరిజ నులు ముందుకు రావాలని సూచించారు. సమాజానికి వ్యాపార రంగంలో ఉన్న అవకా శాలు, ఎదురయ్యే సవాళ్ళు,స్థిరమైన అభి వృద్ధి దిశగా తీసుకోవాల్సిన తదితర అంశా లపై ఎస్సార్ అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కళా శాల ప్రొఫెసర్ ఏఆర్. సత్యవతి విశ్లేషిం చారు. అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏ. వెంక టేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు గిరిజన అభివృద్ధి కోసం వినూత్న వ్యాపార ఆలోచనలను డెవలప్ చేయాలన్నారు. ఈ సద స్సుకు దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి 120 మంది రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. 95 పూర్తి స్థాయి పరిశోధనా పత్రాలు అందాయి. మొత్తం 15 మంది తమ పరిశో ధనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్స్ ఎస్. రమేష్, ఎస్. నారాయణస్వామి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, సదస్సు కన్వీనర్ పారెల్లి శ్రీనివాస్, ఆర్గనై జింగ్ సెక్రటరీ కోటగిరి రాంబాబు, కో కన్వీనర్‌డి. రమేష్, విజయప్ర సాద్, కరీమా, బి. రమేష్, టి. అరుణ కుమారి, ఎన్. శ్రీదేవి, నిమిషా, వేముల కామేశ్వరరావు,కొండలరావు, పర్వీన్, పొట్లపువ్వు శ్రీనివాస రావు, విమల, దీపిక, తేజస్విని, లీలా, వకుల ధర్మారావు, టి. రమేష్,ఈ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బిఇడి కాలేజీ ప్రిన్సిపాల్ రిలీవ్

ప్రజాపక్షం/భద్రాచలం : స్థానిక గిరిజన బిఇడి కళాశాల ప్రిన్సిపాల్‌ను పరిపాలనా సౌలభ్యం కోసం సోమవారం రిలీవ్ చేసి మాతృసంస్థకు పంపినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. ప్రస్తుత డిఇడి కాలేజీ ప్రిన్సిపల్ భవానీని బిఇడీ కాలేజీకి ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ప్రజాపాలనలో కార్యాలయాలు పరిశుభ్రం

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఐటిడిఏ కా ర్యాలయంలోని పలు కార్యాలయాల్లో పరిశుభ్రత పాటిస్తూ పైళ్లను సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పనికి రాని పైళ్లను తీసివేయడంతో పాటు అవసరమైన ప్రతీ ఫైళ్‌ను ఓ పద్ధతి ప్రకారం గతంలో మాదిరిగానే పేర్చి అమర్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ పవర్ వేణు, మేనేజర్ ఆదినా రాయణ, శ్రీనివాస్, సాయిచంద్, సూపల్, లక్ష్మ య్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటేలో సత్తా చాటిన మైకేల్ పాల్

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఏపీలోని పల్నాడు జిల్లా, చిలకలూరిపేట లో జరిగిన ఆల్అండియా స్థాయిలో జరిగిన కరాటే పోటీలో మల్లెబోయిన మైకేల్ పాల్ (9) సత్తా చాటారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని కొత్తకొత్తూరు ఎస్ఎఫ్ఎస్ పాఠశాల లో మూడో తరగతి చదువుతున్న మైకేల్ పాల్ కరాటే లో ప్రతిభ కనపరిచారు. చిలకలూరిపేట లో ఆల్ ఇండియా ఓపెన్ పూనాకోషి షోటోకాన్ కరాటే చాంపియన్ షిఫ్ లో సబ్ జూనియర్ బాలుర అండర్ 25 కేజీల కేటగిరి లో రెండో స్థానం ను సాధించాడు. నిర్వహకులు షీల్డ్, ప్రశంస పత్రం ను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మిక్కిలి జోషెఫ్, విద్యార్థి తల్లిదండ్రులు మల్లెబోయిన ఉపేందర్‌పుష్పలు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

మిలియన్ మార్చ్‌కు అధిక సంఖ్యలో తరలిరావాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ అమర వీరుల ను స్మరించుకునేందుకు మంగళవారం హైద్రాబాద్ లో తలపెట్టిన చలో గన్ పార్క్ ను విజయవంతం చేయాలని ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం గ్రేట్ మిలియన్ మార్చ్ డే పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిలియన్ మార్చ్ లో గ్రామా గ్రామానా పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు. గ్రేట్ మిలియన్ మార్చ్ డే విజయవంతం. చేసి తెలంగాణ అమర వీరుల ను స్మరించుకుందామని పేర్కొన్నారు. తెలంగాణ హక్కుల దినంగా పాటించేందుకు ప్రతీ ఉద్యమకారులు అమరువీరుల స్థూపం వద్ద కు తరలిరావాలని కోరారు. ఉద్యమకారుల న్యాయ మైన డిమాండ్ల సాధన కోసం క్షేత్ర స్థాయిలో ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జేఏసీ నాయకులు తీగ రాములు, మందడి వెంకటేశ్వరరావు, జీ.అంజి, ఎస్.యాకయ్య, కె.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సర్పంచ్ ఆర్థికసాయం

ప్రజాపక్షం/అశ్వాపురం: మొండికుంట గ్రామా నికి చెందిన కీర్తి అజయ్ బాబా అనారోగ్యంతో మృతి చెందగా, సర్పంచ్ మర్రి సంధ్య వారి స్వగృ హానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్య క్రియల ఖర్చుల కోసం రూ 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లు మల్లా రెడ్డి, బిఆర్ఎస్ మండల కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు శ్యామల యాదగిరి రెడ్డి, రామగిరి భాస్కర్, సాంబయ్య, పాయం సీతారాములు, పాయం ఎర్రయ్య, శ్రీను, మహేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది

ప్రజాపక్షం/బూర్గంపాడు: ఘన వ్యర్థాల నిర్వహ ణతో పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని కోయ గూడెం సర్పంచ్ కొండమ్మ అన్నారు. సోమ వారం కోయగూడెం గ్రామంలో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘన వ్యర్థాలను సక్రమంగా నిర్వహిస్తే పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. గడ్డి, ఆకులు, కూరగాయల తొక్కలు, జంతువుల వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చుకోవచ్చని, బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. వర్మీ కంపోస్టింగ్ ద్వారా నేల సారం పెరుగుతుం దని, వ్యర్థాల నిర్వహణ ఖర్చు కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ కృష్ణవేణి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, ఐటిసి అనుబంధ సంస్థ ఎంఎస్‌కే ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా నిందితుడిని బైండోవర్

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలో పశువుల అక్రమ రవాణా కేసుల్లో నిందితు డైన హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ మోయిజ్ ఖురేషిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడకుండా రూ 5లక్షల పూచీ కత్తుతో ఏడాది పాటు సత్ప్ర వర్తన కలిగి ఉండేలా చర్యలు తీసుకున్నారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా అశ్వాపురం సీఐ తెలిపారు.

మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయండి

-కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల ఆందోళన

ప్రజాపక్షం/ఖమ్మం : మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటా రూ. 2,400 చొప్పున కొనుగోలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, బొంతు రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటా మొక్కజొన్నలు కేవలం రూ. 1,400 నుంచి రూ. 1,500 లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వారు తెలిపారు. రైతులు క్వింటాకు ఎడేనిమిది వందల రూపాయలు నష్టపోతున్నారని, పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రమేష్, రాంబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మాదినేని రమేష్, ఏపూరి రవీంద్ర బాబు, పావులూరి మల్లికార్జున్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, దెరంగుల లక్ష్మయ్య, అడపా కృష్ణయ్య, భూక్యా వీరభద్రం, రవికుమార్, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్‌కె ఖాసీం, పాశం అప్పారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

యుపిహెచ్‌సిల పరిపుష్టికి చర్యలు

-ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
-యుపిహెచ్‌సిని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యుపిహెచ్‌సి) పరిపుష్టికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆసుపత్రిలో పారిశుధ్య పనులు పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మం నగరం శ్రీనివాసనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను పరిశీలించారు. ఓపి, ఐపి సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగుల వైద్యంకు ఉపయోగించే వ్యర్థాల నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి ఆవరణ లో రోగుల గదులు శుభ్రంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. దవాఖానా కు వచ్చే రోగులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఎఎన్‌ఎంల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో రామారావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో వేణుమాధవ్, వైద్యాధికారులు సమీరా, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం

-సర్దార్ పటేల్ మైదానంకు నూతన శోభ
-మంత్రి తుమ్మల కృషితో క్రీడా సదుపాయాల కల్పన

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం సర్దార్ పటేల్ మైదానం కొత్త రూపు సంతరించుకోనుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో క్రీడాకారులకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పటేల్ మైదానంలో రూ. 8.50 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయితే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలను సైతం నిర్వహించే అవకాశం ఉంటుంది. క్రీడా రంగంలో ఖమ్మం జిల్లాను అగ్ర స్థానంలో నిలిపేందుకు మైదానంలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టిసారించి నిధులను మంజూరు చేయించారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టారు. సిఎంకప్ 2024 పోటీల్లో రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్ విభాగంలో ఖమ్మంజిల్లాకు చెందిన క్రీడాకారులు 12 పతకాలు సాధించారు. ఇప్పుడు సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి వస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన జిల్లా క్రీడాకారులు రాణించే అవకాశాలు ఉన్నాయి. మరో 10 రోజుల్లో సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి పట్ల క్రీడాకారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగులో రైతులు నూతన యాజమాన్య పద్ధతులు అవలంభించాలి

ప్రజాపక్షం/చింతకాని : వ్యవసాయ సాగులో రైతులు నూతన యాజమాన్య పద్ధతులు అవలంభించాలని మత్కేపల్లిల మార్కెట్ కమిటీ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం చింతకాని రైతు వేదికలో ఆత్మ కమిటీ శిక్షణలో భాగంగా రైతులకు సాగు విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరక్టర్‌లు కొప్పుల గోవిందరావు, కూరపాటి తిరిష, చింతకాని సర్పంచ్ కిలారి మనోహర్‌బాబు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరక్టర్‌లు షేక్ ఖాసీం, మేకపోతుల రేవతి, మండల వ్యవసాయాధికారిణి ఎస్ మానస, ఏఈవోలు తేజ, ఆయేషా. తాహియా, కళ్యాణీ, కార్తీక్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌పివి వ్యాక్సినేషన్‌తో గర్భాశయ క్యాన్సర్ నివారణ

హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను ప్రారంభించిన ఎంపీడీవో ఎస్ కే.సిలార్ సాహెబ్

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : హెచ్ పీ వీ వ్యాక్సినేషన్ తో మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్ ను నివారించవచ్చని ఎంపీడీవో ఎస్ కే సిలార్ సాహెబ్ తెలిపారు. తిరుమలాయపాలెం వైద్య విధాన పరిషత్ లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 నుంచి 15 సంవత్సరాల కౌమర బాలికలకు హెచ్ పీ వీ టీకా వేస్తే భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ ను కట్టడి చేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఆడపిల్లల తల్లిదండ్రుల అనుమతితో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా టీకా సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని ఆయన తెలిపారు. మొదటి రోజు టీకా తీసుకున్న 18 మందిలో అందరూ ఎలాంటి అసౌకర్యానికి గురి కాలేదని వారికి అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశారని టీకా తీసుకున్న ఆడపిల్లలను వైద్యుల సమక్షంలో ఉంచి పర్యవేక్షించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, వైద్య విధాన పరిషత్ సూపర్డెంట్ డాక్టర్ కృపఉషశ్రీ, బోల్లి కొండ శ్రీనివాసరావు, డాక్టర్ అవినాష్, డాక్టర్ బి.వసుంధర, ఆర్ఎంఓ డాక్టర్ వైదేహి, డాక్టర్ రాజకుమార్, సిడిపిఓ కవిత, గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్, విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్, వేల్పుల కుమారి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

-నలుగురు విద్యార్థినులకు అస్వస్థత -వంద పడకల ఆసుపత్రికి తరలింపు

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి పూలే గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థినిలు ఆదివారం రాత్రి తిన్న భోజనం వికటించి అస్వస్థకు గురయ్యారు. రోజు లాగానే రాత్రిపూట భోజనం చేసిన విద్యార్థినిలు తెల్లవారుజాము నుండే వాంతులు చేసుకోవడంతో గుర్తించిన గురుకుల పాఠశాల సిబ్బంది హుటాహుటిన, గుట్టుచప్పుడు కాకుండా స్థానిక 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు వెల్లడించారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి : పాయం..

విషయం తెలుసుకున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆసుపత్రికి చేరుకొని చిన్నారులను పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అలాగే మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు, మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురజాల గోపి, అక్షర మహిళా మండలి సభ్యులతో కలిసి చిన్నారుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గురుకుల పాఠశాల వార్డెన్, పాఠశాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాపక్షం/ముదిగొండ : పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని ఎడవల్లి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం. నాగలక్ష్మి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు పరీక్ష సామగ్రి అవసరమని అడిగిన వెంటనే అందజేసిన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బోధన సిబ్బంది శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, ఆర్. లింగయ్య, పద్మావతి, సునీత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మల్లెమడుగు విద్యార్థులకు సిల్వర్ మెడల్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మల్లెమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాంబమూర్తి, పిడి బియ్యని కృష్ణయ్య సోమవారం తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన జిల్లా స్థాయి ఉమెన్స్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో మల్లెమడుగు పాఠశాల విద్యార్థినులు సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. వీరికి జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత, ఎఎంవో పెసర ప్రభాకర్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ ఎస్ఐ ప్రవీణ్, ఫుట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఆదర్శ్, హెచ్ఎం లక్ష్మి నర్సయ్య చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారన్నారు. జిల్లా స్థాయితో పాటు రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేణి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, శారద, హేమలత, సుధాకర్, స్వర్ణలత, బ్రహ్మచారి, అమ్మాజీ, దేవమణెమ్మ, సుజాత, వెంకటేశ్వరరావు, సహదేవ్, అరుణ, బాలమణి తో పాటు కార్పొరేటర్లు లలితారాణి, నిరంజన్‌కుమార్, స్థానికులు బోజడ్ల సూర్యం, పీట్ల కృష్ణమూర్తి, కృష్ణ, వెంకయ్య, జానిమియా, తిరుపతిరావు, తాటికొండ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. సోమవారం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు శ్రీనివాసరెడ్డి, లింగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినీ సరస్ మేళా ప్రారంభం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, నాబార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ సరస్ మేళాను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. సోమవారం వీడియోస్ కాలనీలోని సమీకృత కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ మేళాను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ మేళాను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఈ మేళాలో ప్రదర్శనతో పాటు విక్రయాలు జరుపుతారన్నారు. మార్చి 14 వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు మేళా ఉంటుందని తెలిపారు.ఈ మేళాలో కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, మెప్మా బాధ్యులు సుజాత తదితరులు పాల్గొన్నారు.